క్లుప్తంగా

విద్యార్థులకు అభినందన



విజేతలను అభినందిస్తున్న అధ్యాపకులు

సరుబుజ్జిలి: తొగరాం హైస్కూల్‌లో జరిగిన జోనల్ మీట్ క్రీడా పోటీల్లో చినకాగితాపల్లి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అన్ని విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. విజేతలకు హైస్కూల్ హెచ్‌ఎం తవిటినాయుడు శనివారం అభినందించారు. కబడ్డీ, లాంగ్‌జంప్, పరుగు పందెంలో మొదటి స్థానాల్లో నిలిచిన విజేతలకు షీల్డులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, యోగా ట్రైనర్స్ ఈశ్వరరావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

మాజీ జెడ్పీటీసీ మృతికి సంతాపం



జగన్నాథ దాసు (ఫైల్)

సారవకోట: మండలంలోని తొగిరి గ్రామానికి చెందిన సారవకోట మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు నామగిరి జగన్నాథ దాసు (73) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. హృదయ సంబంధిత సమస్య రావడంతో స్థానికంగా ప్రథమ చికిత్స నిర్వహించి నరసన్నపేట ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. జగన్నాథ దాసుకు భార్య శార్వాణి, కుమార్తె విష్ణు షాలిని ఉన్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

సారవకోట: మండలంలోని అవలింగి సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం సత్యసాయి మందిరంలో 98 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. సత్యసాయి బాబా 98వ జయంతి పురస్కరించుకుని మందిరంలో జరుగుతున్న ఉత్సవాల్లో భాగంగా దుప్పట్లు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆకట్టుకున్న అయ్యప్ప పడిపూజ సెట్



వసుంధరలో ఏర్పాటు చేసిన పడిపూజ సెట్

మెళియాపుట్టి: మండలంలోని వసుంధర గ్రామంలో అయ్యప్ప స్వాములు శనివారం పడిపూజ నిర్వహించారు. 15 అడుగుల శివుని విగ్రహం, వినాయకుడు, కుమార స్వామి విగ్రహాలు, విద్యుత్ వెలుగులు చూపరులను ఆకట్టుకున్నాయి.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

బూర్జ: మండలంలోని పాలవలస జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అండర్-17 కబడ్డీ బాలుర విభాగంలో మండల స్థాయిలో గెలిపొంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం ఎం.ప్రతాపరుద్రుడు శనివారం తెలియజేశారు. విద్యార్థులను ఉపాధ్యాయులు, స్థానికులు అభినందించారు.

ఐఈఈఎస్‌లో 15వ ర్యాంక్



సతీష్‌ను అభినందిస్తున్న గ్రామస్తులు

పోలాకి: మండలంలోని చీడివలస పంచాయతీ పరిధిలోని జిల్లేడువలస గ్రామానికి చెందిన గొల్లంగి సతీష్ ఆల్ ఇండియా ఐఈఎస్‌లో (ఇంజినీరింగ్ విభాగం) 15వ ర్యాంక్ సాధించాడు. విద్యార్థికి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, గ్రామస్తులు శనివారం అభినందించారు.

ప్రణాళికలు తయారుచేయాలి

సరుబుజ్జిలి: పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలి ఎంఈఓ-2 కె.శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో అన్ని పాఠశాలల హెచ్‌ఎంలతో శనివారం అవగాహన సమావేశం నిర్వహించారు. పాఠశాలల ఆవాసాల్లో గల వివరాలు సేకరించాలని సూచించారు. సమావేశంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ పైడి మురళీకృష్ణ, సీఆర్‌ఎంటీలు చిన్నారావు, చిరంజీవి, రామినాయుడు, రోహిణి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే లక్ష్యం

- శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన



ఆమదాలవలస రూరల్: శ్రీనివాసాచార్యులపేటలో సంక్షేమ పథకాలను వివరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస రూరల్: ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని శ్రీనివాసాచార్యులపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల తీరును వివరిస్తూ, ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని తెలియజేసే కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన నాలుగేన్నరేళ్ల పాలనలో జగనన్న గ్రామాలను ఎంతో అభివృద్ధి చేశారన్నారు. ఇంటి వద్దకే సచివాలయ పాలన తీసుకువచ్చి పథకాలను అందజేస్తున్న ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికే అధికారులతో కలిసి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వస్తున్నామని వివరించారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రజాసంక్షేమమే అజెండాగా పరిపాలన సాగిస్తున్న ఈ ప్రభుత్వానికి రానున్న రోజుల్లోనూ ఆదరించాలని కోరారు. దొంగ మ్యానిఫెస్టోలతో మరలా ప్రజలను మభ్యపెట్టడానికి టీడీపీ నాయకులు వస్తారని, వారి మాయమాటలను నమ్మవద్దరాంరరు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు గురుగుబెల్లి ప్రభాకరరావు, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్, పంచాయతీ కార్యదర్శి బి.నాగరాజు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

భూ సర్వే పూర్తిచేయాలి

- టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్



వివరాలు తెలుసుకుంటున్న టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర భూ రీసర్వేను డిసెంబర్ మొదటి వారం నాటికి పూర్తిచేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి శనివారం వచ్చిన ఆయన భూ రీసర్వేకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలో డిసెంబర్ 6వ తేదీ నాటికి శత శాతం సర్వే పూర్తి చేసుకున్నట్లు ఆన్‌లైన్‌లో కనిపించాలని తహసీల్దార్ అప్పలరాజుకు సూచించారు. జంబాడ, సరదాం, కొత్తపేట, తాయి మాంబాపురం తదితర రెవెన్యూ గ్రామాల్లో ప్రస్తుతం జరుగుతున్న సర్వే వివరాలను తెలుసుకున్నారు.

తప్పులు లేని ఓటర్ల జాబితా సిద్ధం..

తప్పులు లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని టెక్కలి సబ్ కలెక్టర్ అన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీల నాయకులకు ఓటర్ల జాబితాలను అందించి, సరిచేసేందుకు వారి సూచనలు, సలహాలను తీసుకుంటున్నట్లు తెలిపారు. జీరో ఇంటి నంబర్ ఉన్న ఓటర్లతోపాటు పేరు, తండ్రి పేరు, వయస్సు, ఫొటో ఒకేలా ఉన్న ఓటర్లను గుర్తించి వాటిని విచారణ చేస్తున్నామన్నారు. డిసెంబర్ 9వ తేదీ వరకు బీఎల్‌ఓలు పోలింగ్ కేంద్రాల వారీగా గుర్తించిన వారి ఇంటికి వెళ్లి విచారణ చేసి వారి అనుమతితో ఓట్లు తొలగింపు, కొనసాగింపు చేస్తారన్నారు. 2022 జనవరి తరువాత తొలగించిన ఓటర్లపైన విచారణ చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 26వ తేదీ, డిసెంబర్ 3వ తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టామన్నారు. ఉప తహసీల్దార్ రషీద్ అహ్మద్, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, ఆర్‌ఐ గవరయ్య, వీఆర్వోలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని హిరమండలం సచివాలయం-2 పరిధిలో శనివారం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏవీ షురేషులు నాలుగున్నరేళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వెళ్లి వివరించారు. టీడీపీ పాలనకు, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలు గమనించాలన్నారు.

మార్కెట్‌కు కార్తీక శోభ



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

పాతపట్నం: కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన జనంతో పాతపట్నంలోని దుకాణాలు శనివారం కళకళలాడాయి. ఆదివారం కార్తీక పౌర్ణమి పూజలు నిర్వహించనున్నారు. చెరుకులు, పండ్లు, పూజాసామగ్రికి గిరాకీ ఏర్పడింది. కొరసవాడ, తిడ్డిమి, తెంబూరు, గంగువాడ, రొంపివలస, ఎస్.ఎస్ మనుగు, సింగుపురం, కల్లాట, ధనుపురం తదితర ప్రాంతాల నుంచి భక్తులు మండల కేంద్రానికి వచ్చారు.

విజయవాడకు బస్సులు పునరుద్ధరించాలి

కొత్తూరు: కొత్తూరు నుంచి విజయవాడకు వెళ్లే ఆర్టీసీ బస్సులను పునరుద్ధరించాలని స్థానిక ప్ర యాణికులు కోరారు. కొత్తూరు నుంచి రాజమండ్రి, కాకినాడ, భీమవరం మీదుగా విజయవాడకు వెళ్లే మూడు బస్సులను రద్దు చేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. జిల్లాకు శివారు మండలం, ఒడిశా సరిహద్దులో ఉన్నందున రెండు రాష్ట్ర ప్రజలకు ఈ సర్వీస్‌లు ఎంతో ఉపయోగపడతాయ న్నారు. పాలకొండ, శ్రీకాకుళం ఆర్టీసీ డిపో మేనేజర్‌లు స్పందించి సర్వీస్‌లు పునరుద్ధరించాలని కోరారు.

ఇంటి పన్ను వసూలు చేయండి

మెళియాపుట్టి: ఇంటి పన్ను వసూలు వేగవంతం చేయాలని డీఎల్పీఓ ఐ.వి.రమణ అన్నారు. నివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై దృష్టి సారించాలన్నారు. భవన నిర్మాణాల పనులపై దృష్టి సారించాలన్నారు. ప్రజల అసరాల మేరకు మరుగుదొడ్లు మంజూరు చేయాలన్నారు. ఎంపీడీఓ చంద్రకుమారి, పీఆర్ ఏఈ ఆనంద్, ఇంజినీరింగ్ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న మూడు గ్రామ వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ రాంబాబు శనివారం తెలిపారు. దీంట్లో అలుదు సచివాలయ పరిధిలో ఉన్న క్లస్టర్-16 ఎస్సీ మహిళకు, ధర్మలక్ష్మీపురం సచివాలయ పరిధిలో ఉన్న క్లస్టర్-5 ఎస్టీ మహిళకు, బుడితి సచివాలయ పరిధిలో ఉన్న క్లస్టర్-6 ఎస్సీ జనరల్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 28వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



పాతపట్నం: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ రత్నకుమారి



హిరమండలం: అవలంగిలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

హిరమండలం: మండలంలోని అవలంగి జిల్లా ఉన్నత పాఠశాలలో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం జి.రమేష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజును రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నామన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ధనుంజయరావు, కృపానందం, మాధవరావు, రమణమూర్తి, గిరిబాబు, రత్నకుమార్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మండల కేంద్రంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ కె.వి.రత్నకుమారి ఆధ్వర్యంలో శనివారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ నివాళులర్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు



మాట్లాడుతున్న ఏడీ మధుబాబు

మెళియాపుట్టి: ధాన్యం కొనుగోలులో మిల్లుల వద్ద రైతులకు ఎటువంటి ఇబ్బందులకు తావులేకుండా అధికారులు బాధ్యత వహిస్తారని పలాస వ్యవసాయ సహాయ సంచాలకులు లింగాల మధుబాబు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, టెక్నికల్ సిబ్బందితో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా మిల్లర్లు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, రైతులకు ఇబ్బందులకు గురిచేయకుండా చూడాలన్నారు. దీనిపై గ్రామ వ్యవయసాయ సహాయకులు పూర్తి స్థాయిలో దృష్టి సారించాలన్నారు. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లితే చర్యలు తప్పవన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ధాన్యం కొనుగోలు పూర్తిచేయాలన్నారు. తహసీల్దార్ సరోజిని తదితరులు పాల్గొన్నారు.

లింగవివక్షతను రూపుమాపుదాం



పాతపట్నం: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు, అధికారులు

లింగవివక్షపై మహిళా లోకం గొంతెత్తింది. మహిళలు, పురుషులు సమానమేనని, వివక్ష చూపి, తమ అభివృద్ధికి ఆటంకం కారాదని కోరింది. అంతర్జాతీయ స్త్రీ హింసా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని పట్టణాలు, పల్లెల్లో మహిళలు శనివారం ర్యాలీలు నిర్వహించారు. లింగవివక్ష వద్దు.. సమసమాజమే ముద్దు.. పురుషులతో సమానంగా స్త్రీలను చూడాలి, లింగవివక్ష రహిత సమాజానికి కృషి చేద్దామని నినాదాలు చేశారు. అనంతరం అందరూ ఒక్కటేనని లింగవివక్షకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. – సాక్షి నెట్‌వర్క్



నరసన్నపేట: మండల కేంద్రంలో ర్యాలీని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ మెంబర్ ధర్మాన పద్మప్రియ



హిరమండలం: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా సంఘ సభ్యులు, అధికారులు



బూర్జ: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, నాయకులు



మెళియాపుట్టి: మూడు రోడ్ల కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



కొత్తూరు: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడిన మహిళలు



పోలాకి: మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు



పొందూరు: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడిన అధికారులు, మహిళా సంఘాల సభ్యులు మహిళలు



ఎల్.ఎన్.పేట: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న మహిళలు



సరుబుజ్జిలి: మండల కేంద్రంలో ర్యాలీ చేస్తున్న వెలుగు, అంగన్‌వాడీ సిబ్బంది

అర్హులను ఓటర్లుగా చేర్చండి



నరసన్నపేట: మాట్లాడుతున్న పోలాకి తహసీల్దార్ శ్రీరాములు

నరసన్నపేట: గ్రామాల్లో అర్హత కలిగిన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయాలని పోలాకి తహసీల్దార్ శ్రీరాములు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులతో శనివారం ఎన్నికలకు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఓటు నమోదుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యువతీ, యువకులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు గ్రామాల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ తరువాత వస్తున్న ఫిర్యాదులను నమోదు చేస్తున్నామని, వాటిని పరిష్కరించేందుకు బీఎల్‌ఓలకు తగిన సూచనలు చేస్తున్నట్లు తెలిపారు. జలుమూరు, సారవకోట తహసీల్దార్లు బి.సత్యం, హనుమంతరావు పాల్గొన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: అర్హత ఉన్న ప్రతీ విద్యార్థి ఓటరుగా నమోదు అవ్వాలని స్థానిక తహసీల్దార్ చక్రవర్తి సూచించారు. కొత్తూరులోని శ్రీవెంకటసాయి డిగ్రీ కాలేజీలో ఓటరు నమోదుపై శనివారం అవగాహన కల్పించారు. 2024 జనవరి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతీ విద్యార్థి ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆర్‌ఐ గిరిష్ కుమార్, ప్రిన్సిపాల్ లోతుగెడ్డ కృష్ణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తూరు: మండల కేంద్రం కొత్తూరులో శనివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం కొత్తూరు కమిటీ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. సామూహిక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు.